

# మా కుటుంబాన్ని మించిన రామ భక్తులెవరు..?

- నా పేరులోనే రాముడున్నాడు..
- అధికారంలోకి రాగానే యాదాద్రి తరహాలో భద్రాద్రి ఆలయ అభివృద్ధి
- భద్రాచలానికి వరద ముప్పును శాశ్వత ప్రాతిపదికన పరిష్కరిస్తాం..
- భద్రాచలం రోడ్‌షోలో బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

ఖమ్మం, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): తమ కుటుంబం కంటే గొప్ప రామభక్తులు రాష్ట్రంలో ఎవరు లేరని, తన పేరులోనే రాముడు ఉన్నాడని బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి కేటీఆర్ అన్నారు. భద్రాచలం, ఇల్లెందు, అశ్వారావుపేట, కొత్తగూడెం ఎమ్మెల్యే అభర్థులు తెల్లం వెంకట్రావు, బానోతు హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, వనమా వెంకటేశ్వరరావు గెలుపును కాంక్షిస్తూ ఆదివారం ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన రోడ్ షోలో మాట్లాడారు. తొలుత భద్రాచలం పట్టణంలో రోడ్ షో నిర్వహించి ప్రధాన సెంటర్‌లో మాట్లాడారు. భద్రాచలంపై ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అపారమైన ప్రేమ, సీతారాములపై భక్తి ఉందని స్పష్టం చేశారు. ఈ కారణంతోనే కొత్తగూడెం జిల్లాకు భద్రాద్రిగా నామకరణం చేశారని గుర్తుచేశారు. తమ పార్టీ మళ్లీ అధికారంలోకి రాగానే యాదాద్రి తరహాలో భద్రాద్రి ఆలయాన్ని సకల హంగులతో తీర్చిదిద్దుతామన్నారు. భద్రాచలవాసులకు గోదావరి వరద ముప్పు తప్పించేందుకు కరకట్ట నిర్మిస్తామన్నారు. ఇక్కడ ప్రజల ప్రతి సమస్య తనకు తెలుసునన్నారు. భద్రాద్రి రాముడిపై తమ కుటుంబానికి అపార విశ్వాసం ఉందని, ఆయన ఆశీస్సులు తమ పార్టీకి ఉంటాయన్నారు. కొందరు పనిగట్టుకుని మరీ భద్రాచలంపై తమ ప్రభుత్వానికి చిన్నచూపు ఉందని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలవకపోయినా అభివృద్ధి విషయంలో రాజీ పడలేదన్నారు. మరింత అభివృద్ధి జరగాలంటే ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావును గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**16 వేల మందికి పోడు పట్టాలు..**

భద్రాచలం నియోజకవర్గంలో 16వేల ఎకరాలకు పోడు పట్టాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మంత్రి కేటీఆర్ అన్నారు. గిరిజనేతరులకూ పోడు పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోకాలడ్డుతుందని ధ్వజమెత్తారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఎన్నికల్లో ఓడించి సాగనంపితేనే గిరిజనేతరులకు పోడు పట్టాల పంపిణీ సాధ్యమవుతుందన్నారు. సీతమ్మసాగర్ పనులు సాగకపోవడానికి కారణం, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, కాంగ్రెస్ పార్టీ నేతలే కారణమని నిప్పులు చెరిగారు. ఆ పార్టీ నేతలు కేసులు వేయడంతోనే ప్రాజెక్ట్ పనులు ముందుకు సాగడం లేదన్నారు. దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రజల బతుకులను మార్చలేదన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఎలాంటి మేలూ చేయదన్నారు. ప్రజలు వాళ్ల మాటలు నమ్మితే మోసపోవడం ఖాయమన్నారు. ఇప్పటికే కాంగ్రెసోళ్లు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో డబ్బు సంచులతో తిరుగుతున్నారని, వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.



**భద్రాచలానికి వరాలు..**

ఎన్నికల్లో గెలిస్తే నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఓ కోల్డ్‌స్టోరేజీ నిర్మిస్తామన్నారు. వెంకటాపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, చర్లలో డిగ్రీ కళాశాల తీసుకొస్తామన్నారు. భద్రాచలం పట్టణాన్ని మూడు గ్రామాలుగా చేయడంపై ప్రజల్లో కొంత అసంతృప్తి ఉందన్న సమాచారం ప్రభుత్వానికి ఉందని, తమ ప్రభుత్వం భేషజాలకు పోయే ప్రభుత్వం కాదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ప్రాంత ప్రజల అభీష్టం మేరకు భద్రాచలాన్ని ఒక్క గ్రామ పంచాయతీగా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. లేదా మూడు పంచాయతీలు కావాలంటే, మూడిటినీ ఉంచుతామని స్పష్టం చేశారు. తెల్లం వెంకట్రావును గెలిపిస్తే నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే రూ.400 గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్నారు. రైతుబంధు ఎకరానికి రూ.16 వేలు ఇస్తామన్నారు. రాష్ట్రంలోని 93లక్షల రేషన్‌కార్డుదారులకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. రైతుబీమా మాదిరిగానే ప్రతి కుటుంబానికి కేసీఆర్ బీమా కల్పిస్తామన్నారు. దేశాన్ని భ్రష్టు పట్టించింది కాంగ్రెస్ పార్టీయేనని, ఆ పార్టీ ప్రజలందరికీ మొండిచేయి చూపిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మూడోసారి సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. సారపాక బీపీఎల్ స్కూల్ ప్రాంగణంలో హెలికాప్టర్ ల్యాండ్ అయింది. మంత్రి కేటీఆర్ అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా భద్రాచలం పట్టణం చేరుకున్నారు. అనంతరం రోడ్ షో నిర్వహించారు. రోడ్ షోలో మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, ప్రభుత్వ విప్, బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక ఎమ్మెల్యే అభ్యర్థి రేగా కాంతారావు, పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పాల్గొన్నారు.

# సింగరేణి బతకాలంటే బీఆర్‌ఎస్సే గెలవాలి




రోడ్ షోలో అభివాదం చేస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ నామా, ఎమ్మెల్యే అభ్యర్థి వనమా, జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల, మున్సిపల్ చైర్‌పర్సన్ సీతాలక్ష్మి

- కొత్తగూడేనికి విమానాశ్రయాన్ని పోగొట్టింది బీజేపీ సర్కారే
- అంబసత్రం భూసమస్యకు పరిష్కారం చూపిస్తాం..
- గిరిజనేతరులకూ పోడుపట్టాలు ఇస్తాం..
- కొత్తగూడెం రోడ్ షోలో బీఆర్ఎఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): సింగరేణి బతకాలంటే బీఆర్‌ఎస్ గెలవాలని, కార్మికులు ఉద్యమస్ఫూర్తిని చాటి బీఆర్‌ఎస్‌ను గెలిపించుకోవాలని పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. కొత్తగూడెం ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావును గెలుపును కాంక్షిస్తూ ఆదివారం ఆయన ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రతో కలిసి జిల్లాకేంద్రంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సింగరేణి కార్మికుల్లో పోరాట స్ఫూర్తి ఉందని, చైతన్యవంతమైన నాయకత్వం ఉందన్నారు. అదే ఉద్యమ స్ఫూర్తితో కొత్తగూడెంలో గులాబీ జెండా ఎగురవేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సింగరేణిని మింగేయాలని చూస్తున్నదని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాత్రం సంస్థను కాపాడుకుంటున్నదన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాతే కార్మికులకు లాభాల్లో వాటా, దసరా, దీపావళి బోనస్ పెరిగిందన్నారు.

**అభివృద్ధి పనులకు బీజేపీ మోకాలడ్డు..**

కొత్తగూడేనికి విమానాశ్రయాన్ని తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం యత్నిస్తుంటే కేంద్రం ఆ ప్రయత్నానికి అడ్డుపుల్ల వేసిందన్నారు. ప్రధాని మోదీ పనిగట్టుకుని తమ ప్రయత్నాలను అడ్డుకున్నారని ఆరోపించారు. కొత్తగూడెంలో చాలాకాలం నుంచి అంబాసత్రం భూముల సమస్య ఉందని, ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఆ సమస్యకు పరిష్కారంచూపిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రేగళ్ల ప్రాంతంలో కొందరికి పోడు పట్టాలు రాలేదనే విషయం తమ దృష్టికి వచ్చిందని, ఆ సమస్యను కూడా త్వరలో పరిష్కరిస్తామని ప్రకటించారు. గిరిజనులతో పాటు కొందరు గిరిజనేతరులు కూడా పోడు చేసుకుంటున్నారని, వారికి పోడు పట్టాలు అందించేందుకు గిరిజన చట్టం అడ్డుగా ఉందని, సున్నితమైన విషయం కాబట్టి ప్రత్యేక చొరవ తీసుకుని పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల్లో డబ్బులు కట్టలు పట్టుకుని కొందరు ఓట్లు కొనుగోలు చేయడానికి వస్తారని, ప్రజలు వారి మాటలు నమ్మొద్దన్నారు. కొత్తగా బీఆర్‌ఎస్‌లో చేరిన కోనేరు చిన్ని, ఎడవల్లి కృష్ణ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. రోడ్ షోలో బీఆర్‌ఎస్ పినపాక నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి కోనేరు చిన్ని, ఉద్యమకారులు పటేల్‌రావు, మానవతారాయ్, జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, ముఖ్యనేత ఎడవల్లి కృష్ణ, మున్సిపల్ చైర్మన్ కాపు సీతాలక్ష్మి, ఎంపీపీ శాంతి, మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్ పాల్గొన్నారు.



## ఇక్కడ గెలిచేది బీఆర్‌ఎస్సే..

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా

'కొత్తగూడెం అడ్డా.. వనమా అడ్డా' అని ఇక్కడ గెలిచేది తానేనని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. తాను వార్డు మెంబర్ నుంచి మంత్రిగా ఎదిగానన్నారు. కొత్తగూడెం అభివృద్ధిలో తన కృషి ఎంతో ఉందన్నారు. కొందరు మాయమాటలు చెప్పి ఓట్లు అడుగుతారని, ప్రజలు వారి మాయలో పడొద్దన్నారు. బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్సేనని, పార్టీ హ్యాట్రిక్ విజయం ఖాయమన్నారు.



## కేటీఆర్ రోడ్ షో సక్సెస్

మంత్రి కేటీఆర్‌ను చూసేందుకు వందలాది మంది అభిమానులు రోడ్డు పక్కన వేచి ఉన్నారు. ఆయన జిల్లాకేంద్రంలోని త్రీటౌన్ సెంటర్‌కు చేరుకోగానే ఆ ప్రాంతం జన సంద్రమైంది. ఆయన ప్రసంగం బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. బస్టాండ్ సెంటర్ నుంచి గణేష్ టెంపుల్ వరకు జన సందోహం కనిపించింది. డప్పు వాద్యాలకు పార్టీ నేతలు నృత్యం చేస్తూ సందడి చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి వనమా కూడా వారితో కలిసి కాలు కదిపారు.